# ధర్మపథం



## గోకులగాథ – అంతరార్థం

శ్రీ హరి దశావతారాలలోను పరిపూర్ణమైనవి రెండు. అవి శ్రీ రామావతారం, శ్రీ కృష్ణావతారమున్నూ. శ్రీ రాముడు ఆదర్శ మహా పురుషుడుగా చిత్రించబడి ఉన్నాడు. శ్రీ కృష్ణుడు విలాస పురుషుడుగానూ, బాల్యంలో అల్లరి పిల్లవాడు గానూ, అద్భుతకృత్యాలు చేసిన వాడుగానూ భాగవతాన్ని బట్టి గోచరిస్తాడు. భారతాన్ని బట్టి గొప్ప రాజనీతివేత్తగానూ, తత్త్వోప దేశికుడు గానూ కానవస్తాడు. శ్రీరాముడు, తాను భగవదవతారమూర్తినని చెప్పలేదు. ఐశ్వరూపాన్ని ప్రదర్శించిన శ్రీ కృష్ణుడు, తాను భగవంతుడననీ, పరమాత్మ స్వరూపుడననీ తెలియ జేస్తాడు. అందు వల్లనే "శ్రీ కృష్ణపరమాత్మ" అనే పేరు వాడుకలోకి వచ్చింది. "రామపరమాత్మ" అనే పేరు వాడుకలోకి రాలేదు.

దీనిని బట్టి శ్రీ కృష్ణుని గోకుల గాథలో ఒక విశిష్టమైన అంతరార్థం ఇమిడి ఉన్నదని ఊహించడానికి అవకాశం ఉన్నది.

జీవులు నిరవధికమైన భక్తి కలిగి నిర్మల మనస్సుతో ఉండి భగవంతుని ధ్యానిస్తూ ఉండిన యెడల సంసార బంధముల నుండి విడుదలను పొంది ముక్తిని పొందగలరు. వారు మమకారాన్ని విడిచినట్లే ఆత్మాభిమానాన్ని కూడా విడువ వలెను.

పరమాత్మ స్వరూపుడగు శ్రీ కృష్ణుని యందు ప్రగాఢమగు భక్తి గల గోపికలే జీవులు. గోకులమే వారి హృదయము. అందు నివసించు శ్రీ కృష్ణుడే వారి హృదయములలో స్థిరముగా నెలకొని యున్న పరమాత్మ. పావనమైన యమునా నదీ ప్రవాహమే అవిచ్ఛిన్నంగా పొంగి పొరలే భక్తి భావం.

వారు శ్రీ కృష్ణుని వేణునాదాన్ని విని తమ వారిని లెక్క చేయకుండా, గృహాల నుండి అతని సన్నిధికి వెళ్లడమే మమత్వాన్ని విడిచి పెట్టడం.

శ్రీ కృష్ణుడు గోపికల వస్త్రాలను అపహరించడం, జీవులు ఆత్మాభిమానాన్ని విడిచి పెట్టవలెనని బోధించుట కొరకే అని మనం గ్రహించాలి. అతడు గోకులంలో చేసిన అల్లరి పనులన్నీ జీవుల శాంత గుణాన్ని పరీక్షించడానికే అని తెలుసు కోవాలి. "తానే పరమాత్మ"నని ప్రజలు గ్రహించ డానికే అతడు అద్భుతమైన పనులు చేశాడని, ఆలోచిస్తే తెలియకపోదు.

– బులుసు వేంకటరమణయ్య

మింగాడు!

"చెప్పండి త్వరగా–" వీణ గురించి తనడిగితే– ఆ పాత విషయాలు భర్త ఎందుకు గుర్తు చేస్తున్నాడో సీతకు అర్థం కాలేదు!

'సీతా! నీ వీణ అమ్మేశాను–" అన్నాడు!

సీత పిడుగుపడ్డట్లు.... నిశ్చేష్టురాలై పోయింది!

"సీతా! పాతదైనా బలే ధర వచ్చిందిలే... అసలు పాతవాటికే డిమాండ్ ఎక్కువట. అందులోనూ నీ వీణ చాలా మంచిదిట..." రాజారావు చెప్పుకు పోతున్నాడు!

సీత షాక్ నుండి తేరుకోలేక పోతోంది! అప్రయత్నంగా ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. హాస్పిటల్లో పొందిన ఆరోగ్యమంతా ఒక్కసారిగా పోయినట్టయింది.

"సీతా! నీకు చాలా బాధకలుగుతుందని తెలుసు... కానీ ఏం చెయను. నీకు వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు! ఎక్కడా అప్పుపుట్టలేదు. ఇంటి పరిస్థితి నీకు తెలియందేముంది! నాకు పిచ్చెక్కినట్లయింది.. చివరకొక మిత్రుడు సలహా ఇచ్చాడు. ఆ పరిస్థితిలో ఇక అంతకన్నా గత్యంతరం లేకపోయింది. వీణకంటె నాకు నీ ఆరోగ్యం ముఖ్యమనిపించింది. సీతా... నేను చేసింది తప్పంటావా?"

మెల్లగా అడిగాడు. సీత తేరుకుంది!

'మీ తప్పేం లేదండీ.... అర్హత లేకుండా ఆశలు పెంచుకోడం నాదే తప్పు..." అంది బాధగా.

ఆమె కళ్లముందు.... తను హాస్పిటల్లో కట్టుకున్న ఆశాసౌధాలు కుప్పకూలి పోతున్నట్లుగా కనిపించాయి!

"సీతా! నువ్వు ఆరోగ్యవంతురాలవై.... తిరిగొచ్చావ్!.... అది చాలదూ..." అన్నాడు రాజారావు!

అవును.... ఆ తృప్తి – చాలు.

సంగీతాన్ని ఆధారం చేసుకుని లక్షలు సంపాదించాలనుకుంది కానీ లక్షలిచ్చినా కొనలేని. ఆరోగ్యాన్ని ప్రసాదించింది. వీణ! ఇన్నాళ్ళూ తన ఇంట్లో వున్నందుకు.. ఋణం తీర్చేసుకుని వెళ్ళిపోయింది ఆ సంగీత సరస్వతి!

అందుకు తను బాధపడకూడదు....

ఆనందపడాలి! గర్వపడాలి... అనుకుంటూ చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంది సీత! □